క్లుప్తంగా

తరగతుల నిర్వహణపై ఎంఈవోకు ఫిర్యాదు

టెక్కలి: ప్రభుత్వం సంక్రాంతి సెలవులు ప్రకటించినప్పటికీ ఆయా ఆదేశాలను ఉల్లంఘిస్తూ పట్టణంలో పలు ప్రైవేట్ విద్యా సంస్థలు తరగతులను నిర్వహిస్తున్నారని ఏబీవీపీ నాయకులు అన్నారు. అలాంటి వాటిపై చర్యలు తీసుకోవాలని సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంఈవో తులసీరెడ్డికి మంగళవారం ఫిర్యాదు చేశారు. తరచూ ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘిస్తున్నారన్నారు. ఏబీవీపీ ప్రతినిధులు మురళి, శ్యామ్, మధన్, వెంకటేష్ పాల్గొన్నారు.

పునరావాస కేంద్ర నిర్మాణానికి సాయం



సాయాన్ని అందజేస్తున్న దృశ్యం

కంచిలి: మండపల్లిలోని సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమం ప్రాంగణంలో దివ్యాంగ చిన్నారుల పునరావాస కేంద్ర భవనం నిర్మాణానికి సోంపేటకు చెందిన నిమ్మన మధుసూదనరావు, నాగేశ్వరి దంపతులు రూ. 30 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ మొత్తాన్ని ఫౌండేషన్ నిర్వాహకుడు గుళ్ల రమేష్‌కు మంగళవారం దాత అందజేశారు.

యోగాసనా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పలాస విద్యార్థి



అవార్డుతో సంపతిరావు ఆశీష్

కాశీబుగ్గ: ఓం శ్రీ యోగ సంస్థ నిర్వహించిన 216, 108 రౌండ్ల సూర్య నమస్కారాల్లో పాల్గొన్న సంపతిరావు ఆశీష్‌కు యోగాసనా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. విశాఖపట్నం బీచ్ రోడ్‌లో బుధవారం ఉదయం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలాస సత్యసాయి విద్యావిహార్(రామకృష్ణాపురం)లో ఏడో తరగతి చదువుతున్న ఆశీష్ నిరంతరాయంగా 88 నిమిషాల్లో 2592 ఆసనాలు వేసి ఆకట్టుకున్నాడు. గతేడాది జాతీయ స్థాయి నంది బాలరత్న అవార్డు కూడా అందుకున్నాడు.

తైక్వాండో పోటీలకు కుమార్ ఎంపిక



కుమార్‌ను అభినందిస్తున్న కోచ్ శేఖర్

టెక్కలి రూరల్: స్థానిక క్రీడా వికాస్ కేంద్రానికి చెందిన తైక్వాండో క్రీడాకారుడు పూడి కుమార్ ఆలిండియా యూనివర్సిటీ గేమ్స్‌కు ఎంపికైనట్లు కోచ్ నర్సిపురం శేఖర్ మంగళవారం తెలిపారు. ఈ నెల తొమ్మిది నుంచి 12వ తేదీ వరకు రాజస్థాన్ రాష్ట్రంలోని జంజునూలోని జేజేటీ యూనివర్సిటీలో జరగనున్న పోటీలకు ఆంధ్రప్రదేశ్ జేఎన్‌టీయూ తరఫున కుమార్ 80 కేజీల విభాగంలో తలపడతాడని కోచ్ తెలిపారు.

ఆస్పత్రికి వెళ్లి.. పింఛన్ అందజేసి..



కాశీప్రసాద్‌కు పింఛన్‌ను అందజేస్తున్న వలంటీర్ చంద్రరావు

సంతబొమ్మాళి: కాపుగోదాయవలస గ్రామానికి చెందిన డయాలసిస్ రోగి కాశీప్రసాద్ రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనకు ఈ నెలకు సంబంధించి పది వేల రూపాయల పింఛన్ మంజూరైంది. దీంతో స్థానిక సర్పంచ్ అంగ లక్ష్మితో కలిసి వలంటీర్ ఎస్.చంద్రరావు మంగళవారం ఆస్పత్రికి వెళ్లి కాశీప్రసాద్‌కు పింఛన్‌ను అందజేసి ఆదర్శంగా నిలిచారు.

36 మందికి ఇళ్లపట్టాలు పంపిణీ



కవిటి: పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్సీ రామారావు

కవిటి: కొజ్జిరియా పంచాయతీ రఘునాథపురం లేఅవుట్‌లో అభివృద్ధి చేసిన కాలనీలో కొజ్జిరియా సచివాలయం పరిధిలోని లబ్ధిదారులకు ఇళ్లపట్టాల్ని పంపిణీ చేయడం ఆనందదాయకమని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఈ మేరకు మంగళవారం 36 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. ఇళ్లస్థలాలు మంజూరైన వారిలో మరో ఇద్దరు లబ్ధిదారులకు పట్టాలు త్వరలో వీరికి మంజూరు చేసిన కాలనీలోనే అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు సర్పంచ్ ఉప్పాడ నీలం, నేత పద్మనాభం తెలిపారు.

ఇళ్ల వద్దకే రేషన్..



ఎండీయూ వాహనం ద్వారా రేషన్ పంపిణీ చేస్తున్న వలంటీర్లు

ప్రగతి పర్వం

ప్రజలకు రేషన్ కష్టాలు తప్పాయి. ప్రజా పంపిణీ వ్యవస్థను వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తుండడంతో ఇంటి ముంగిటకే నిత్యావసర సరుకులు వచ్చి వాలుతున్నాయి. గతంలో కూలి, వ్యవసాయ పనులకు వెళ్లే ప్రజలు నిత్యావసర సరుకుల కోసం రేషన్ డిపోల వద్ద గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చేది. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా పంపిణీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించారు. శ్రమ, కాలం విలువ తెలిసిన ఆయన 2021 జనవరి ఒకటి నుంచి ఇంటింటికీ రేషన్ పథకాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ రేషన్ అందించే మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్స్ (ఎండీయూ వాహనం) ద్వారా ప్రతీ నెల ఒకటో తేదీ నుంచి వారం రోజుల పాటు ఇళ్ల వద్దకు వెళ్లి సరుకులు అందిస్తోంది. బియ్యం సరఫరా చేసే సమయంలో ఎటువంటి అవకతవకలు జరుగకుండా వాహనంలోనే సీసీ కెమెరాలు సైతం అమర్చారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పంపిణీ వ్యవస్థలో తీసుకొచ్చిన మార్పులతో రేషన్ తీసుకునే వారి శాతం పెరిగినట్లు పౌరసరఫరాల అధికారులు చెబుతున్నారు.

–ఇచ్ఛాపురం రూరల్

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో రేషన్ పంపిణీ వివరాలు..

మండలం	కార్డుల సంఖ్య	వాహనాల సంఖ్య
ఇచ్ఛాపురం/ మున్సిపాలిటీ	26,945	12
కవిటి	22,731	14
కంచిలి	20,167	13
సోంపేట	22,293	14

గతంలో బియ్యం వదిలేసేవాళ్లం



నా వయస్సు 70 ఏళ్లు దాటుతున్నాయి. గతంలో రూపాయకి బియ్యం ఇచ్చేవారు. ఈ సమయంలో దూరంలో ఉన్న రేషన్ డీలర్ ఇంటి వద్ద రోజంతా కాపలా కాస్తే తప్పా బియ్యం దొరికేవి కాదు. రెక్కాడితే గానీ డొక్కాడని కూలి కుటుంబాలు మావి. అందుకే ఒక్కో సారి విసిగిపోయి డీలర్ వద్దే బియ్యాన్ని వదిలేసేవాళ్లం. ఇప్పుడు నెలలో మొదటి వారంలోనే ఇంటి వద్దకే బియ్యం బండి వస్తుంది.

– బూర్లె యర్రమ్మ, ఈదుపురం, ఇచ్ఛాపురం మండలం

నాణ్యమైన బియ్యం



గతంలో పురుగులు పట్టిన బియ్యాన్ని ఇచ్చేవారు. ఇప్పుడు నాణ్యమైన బియ్యాన్ని ఇంటి వద్దనే అందజేస్తున్నారు. గతంలో కూలి పనులు మానుకొని రెండు, మూడు రోజుల తరబడి కాపాల కాసే వాళ్లం. అన్ని విధాలుగా నష్టపోయేవాళ్లం. ఇప్పుడు మొదటి వారంలోనే సరుకులు అందిస్తున్నారు. పంచదార, గోధుమపిండి, కందిపప్పును బయట దుకాణంలో కంటే తక్కువ ధరకు ఇస్తున్నారు. ఈ పథకం పెట్టిన జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా రుణపడి ఉంటారు.

– బోర జానకమ్మ, కొఠారీ గ్రామం, ఇచ్ఛాపురం మండలం

వాసుదేవుని సన్నిధిలో దీపోత్సవం



వాసుదేవ పెరుమాళుని సన్నిధిలో దీపోత్సవం

మందస: మందస పట్టణంలో శ్రీవాసుదేవుని స్వామి ఆలయంలో దీపోత్సవం మంగళవారం భక్తి, శ్రద్ధలతో జరిగింది. వేకువజామున నాలుగు గంటల నుంచే ఆధ్యాత్మిక కార్యక్రమాలను ప్రారంభించారు. ప్రధాన అర్చకులు, వేదపండితులైన గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భూదేవి, శ్రీదేవి సమేత వాసుదేవుని తిరువీధులు ప్రదక్షణ ఆచరించి, ఉత్సవమూర్తులను ప్రాంగణానికి తీసుకువచ్చారు. వాసుదేవుడు, ఉభయదేవేరులతో పాటు గోదాదేవిలకు దీపోత్సవం నిర్వహించారు. అండాళ్లగోష్టి, భక్తులు దీపాలతో స్వామివారికి ఆహ్వానం పలుకగా, అర్చకులు వేదమంత్రాలతో పూజలు జరిపారు. ధనుర్మాసవ్రతంలో భాగంగా 24వ పాశుర విన్నపం చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. కార్యక్రమంలో అర్చకులు సచ్చినందపాడి, జి.ఘనశ్యాం, అనిల్‌పాండే, సంతోష్‌పాండే ఉన్నారు.

పాదయాత్ర సుపరిపాలనకు నాంది



నందిగాం: సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న తిలక్ తదితరులు



సోంపేట: ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి పాలాభిషేకరం చేస్తున్న నిమ్మన దాస్, నాయకులు

నందిగాం: ప్రజల వద్దకే వచ్చి వారి సమస్యలు, కష్టాలు తెలుసుకోవడానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్ర ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చాక సుపరిపాలన అందించేందుకు నాంది పలికిందని కాళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. సీఎం జగన్ ప్రతిపక్ష నేతగా చేపట్టిన పాదయాత్రకు మంగళవారంతో ఐదేళ్ల పూర్తయిన సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయలం వద్ద ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి అధ్వర్యంలో పలువురు నేతలతో కలిసి సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం తిలక్ మాట్లాడుతూ.. పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ పూర్తి చేసిన జగన్‌మోహన్‌రెడ్డిని మరో మారు ముఖ్యమంత్రిగా గెలుపించుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తమిరె ఫాల్గుణరావు, జేసీఎస్ ఇన్‌చార్జి జద్యాడ జయరాం, చిన్న జోగారావు, అంబోడి విష్ణు, లవునిపల్లి ధనరాజ్, కణితి నారాయణమూర్తి, బార్నన బాలక్రిష్ణ, రోణంకి ధర్మారావు, అక్కురాడ లోకనాథం, నందిగాం మహేష్, బార్నాన జోగారావు, కణితిగిరి, రత్నాల చిట్టిబాబు ఉన్నారు.

నేటి సంక్షేమానికి పాదయాత్రే నాంది

సోంపేట: రాష్ట్రంలోని అన్నివర్గాలకు నేడు అందుతున్న సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్ చేపట్టిన పాదయాత్రే నాంది పలికిందని ఎంపీపీ నిమ్మన దాస్, జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద అన్నారు. పాదయాత్రకు ఐదు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సోంపేటలో ఎంపీపీ దాస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సంక్షేమాన్ని వివరించారు. అలాగే పలాసపురం గ్రామంలో జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద ఆధ్వర్యంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పలాసపురం సర్పంచ్ తడక జోగారావు, ఎంపీటీసీ సభ్యుడు బొమ్మిడి ధర్మరాజు, పార్టీ నాయకులు తోట ఢిల్లీ, మల్లా వెంకటరమణ, జక్కం రమేష్ ఉన్నారు.



టెక్కలి: కేక్‌ను కార్యకర్తలకు తినిపిస్తున్న దువ్వాడ వాణి

ప్రజల మదిలో చెరగని ముద్ర

టెక్కలి: ప్రజా సంకల్ప పాదయాత్ర ప్రజల మదిలో చెరగని ముద్ర వేసుకుందని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. పాదయాత్రకు ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక వైఎస్సార్ జంక్షన్‌లో విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజా సంకల్ప పాదయాత్రలో తెలుసుకున్న సమస్యలను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కరించారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎ.సరోజనమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు బి.హరి, పీఏసీఎస్ చైర్‌పర్సన్ సత్తారు సత్యం, నాయకులు జి.మోహన్‌రెడ్డి, ఎం.శంకర్, ఎస్.శంకర్, ఎస్.మోహన్, జయరాం, ఫాల్గుణరావు, కె.రామరాజు, ఎ.రాహుల్, రాజేష్ పాల్గొన్నారు.

పోర్టు అప్రోచ్ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ

టెక్కలి: సంతబొమ్మాళి మండలం మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు సంబంధించి టెక్కలి జాతీయ రహదారి నుంచి అప్రోచ్ రోడ్డు పనులను ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. అయోధ్యపురం సమీపంలో జాతీయ రహదారి నుంచి మూలపేట వరకు సుమారు వంద మీటర్ల వెడల్పుతో రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. రోడ్డు పనులు వేగవంతం చేసి వాహనాలు రాకపోకలు సాగించే విధంగా చూడాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో విశ్వ సముద్ర సంస్థ ప్రతినిధులు శంకర్, చక్రవర్తి, శ్రీనివాస్ ఉన్నారు.

అర్హతే ప్రామాణికం



పింఛన్లను అందజేస్తున్న ఎంపీపీ నిమ్మన దాస్

సోంపేట: అర్హులందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. కొర్లాం గ్రామ పంచాయతీలో పింఛన్లు మంగళవారం పంపిణీ చేసి మాట్లాడారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శిలగాన భాస్కరరావు, జేసీఎస్ కన్వీనర్ బుద్దాన శ్రీకృష్ణ, పార్టీ నాయకులు టి.మోహనరావు, బి.పాపారావు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సాయిరాజ్‌కు కృతజ్ఞతలు

కంచిలి: కేసరపడ గ్రామానికి చెందిన మల్లార్పు ధర్మారావు దుబాయ్‌లో కూలీ పని చేస్తూ మృతి చెందాడు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించేయాల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ కృషి చేశారు. దీంతో మృతుని భార్య తులసి, కుటుంబ సభ్యులు మంగళవారం సాయిరాజ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ నాయకులు కప్పల యుగంధర్, మెండ ప్రకాశ్ ఉన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

- జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో నాయకులు



ఇచ్ఛాపురం రూరల్: మందుల చీటీ అందస్తున్న రామారావు, సాయిరాజ్



కంచిలి: మకరాంపురంలో రోగికి కేస్ షీట్ అందజేస్తున్న సాయిరాజ్

ఇచ్ఛాపురం రూరల్: ప్రజల ఆరోగ్యానికి పెద్ద పీట వేసిన మనసున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్సీ నర్తు రామారావు, వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్‌లు అన్నారు. లొద్దపుట్టి గ్రామ సచివాలయం వద్ద జగనన ఆరోగ్య సురక్ష మెగా వైద్య శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. వైద్య సిబ్బంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, కంచిలి ఎంపీపీ పైలా దేవదాస్‌రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ పాతిర్ల రాశేఖరరెడ్డి, సర్పంచ్‌లు ఆశి సులోచనారెడ్డి, నర్తు వరప్రసాద్, వైస్ ఎంపీపీలు దువ్వు వివేకానందరెడ్డి, దున్న గురుమూర్తి, ఎంపీటీసీ సభ్యురాలు ఆశి మంధాకిణి, కౌన్సిలర్లు బచ్చు జగన్, నీలాపు ఢిల్లీ, చాట్ల తులసీదాసురెడ్డి, సల్ల దేవరాజు, ఆశి పురుషోత్తం, దక్కత నూకయ్యరెడ్డి, కారంగి మోహనరావు, రాంపత్ని చిట్టిబాబు ఉన్నారు.

మకరాంపురంలో..

కంచిలి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో అన్నివర్గాలకు వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అన్నారు. మకరాంపురం సచివాలయం ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష -2 వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, సీనియర్ నేత ఇప్పిలి క్రిష్ణారావు, లద్దు కేశవపాత్రో, కొణపల సురేష్, దుర్గాసి ధర్మారావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఉచితంగా కంటి అద్దాలు ఇచ్చారు



పెద్ద డాక్టర్లు వచ్చి ఉచితంగా నేత్ర పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. చాలా సంతోషంగా ఉంది. 65 ఏళ్ల వయస్సులో కంటి పరీక్షలు చేయించుకున్నాను. ఉచితంగా కంటి అద్దాలు ఇచ్చారు.

– ఆశి భాస్కరరెడ్డి, లొద్దపుట్టి, ఇచ్ఛాపురం

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- మంత్రి సీదిరి అప్పలరాజు



వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న మంత్రి అప్పలరాజు

మందస: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తోందని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మందస మండల కేంద్రంలో మంగళవారం జరిగిన వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీలో ఆయన మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన విధంగానే పెంచిన మొత్తంతో కలిపి ఈ నెల నుంచి రూ. మూడు వేలు పింఛన్ అందజేస్తున్నామని చెప్పారు. మేజరు పంచాయతీగా మందస గుర్తింపు చెందిందే తప్పితే గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధి చెందలేదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. గతంలో మందసలో 700 మంది పింఛన్ లబ్ధిదారులు ఉంటే ప్రస్తుతం 1250 మంది ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌కు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, జడ్పీటీసీ సభ్యురాలు సవర చంద్రమ్మ, మందస సర్పంచ్ చెరుకుపల్లి యల్లమ్మ, లక్ష్మణమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు కంచి బెహరా, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అగ్గున్న సూర్యారావు, ఏఎంసీ చైర్మన్ సనపల కామేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు సిందిరి జగన్, గిన్ని తిరుపతిరెడ్డి, శానాపతి కిశోర్ కుమార్, ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు, సెర్ప్ ఏపీఎం గొడబ ప్రసాదరావు, సచివాలయాల కన్వీనర్ చింతాడ గణపతి, కొండల ఢిల్లేశ్వరరావు, బమ్మిడి నవీన్‌కుమార్ ఉన్నారు.

దళితులకు ప్రత్యేక గుర్తింపు

టెక్కలి: టీడీపీ ప్రభుత్వ హయాంలో దళితులపై చంద్రబాబు హీనంగా చూశారని.. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వారికి ప్రత్యేక గుర్తింపునిచ్చే విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దళిత సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. విజయవాడలో ప్రతిష్టాత్మకంగా నిర్మాణం చేసిన అంబేడ్కర్ స్మృతివనం ఈ నెల 19న సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం టెక్కలిలో నియోజకవర్గ స్థాయిలో దళితులతో సమావేశం నిర్వహించారు. సీఎం జగన్ దళితులను అక్కున చేర్చుకున్నారని గుర్తు చేశారు. స్మృతివనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి పెద్ద ఎత్తున దళితులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా టెక్కలి ఎంపీపీ ఎ.సరోజనమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు బి.హరి, దళిత సామాజిక వర్గం ప్రజాప్రతినిధులు, సంఘాల నాయకులు కె.సంజీవరావు, జె.జయరాం, ఎ.రాహుల్, చింతాడ చిన్నారావు తదితరులున్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తి భావితరాలకు తెలియాలి

ఇచ్ఛాపురం రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయడమే లక్ష్యంగా సామాజిక సమతా సంకల్పం పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అన్నారు. మంగళవారం ఆయన లొద్దపుట్టి పైలాన్ వద్ద ఎమ్మెల్సీ నర్తు రామారావుతో కలసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విజయవాడ నడిబొడ్డున రూ.404 కోట్లతో నిర్మించిన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఈ నెల 19న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరిస్తున్న నేపథ్యంలో నియోజకవర్గం అంతా పండగ వాతావరణంలో అంబేడ్కర్‌కు ఘన నివాళులు అర్పించడం జరుగుతుందన్నారు. ఎంపీపీలు బోర పుష్ప, పైలా దేవదాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు ఉప్పాడ నారాయణమ్మ, ఇప్పిలి లోలాక్షి, ఏఎంసీ చైర్మన్ ఎన్.బాబూరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజలక్ష్మి తదితరులున్నారు.

సంతకాల సేకరణ

కవిటి: విజయవాడలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో భాగంగా కవిటి సచివాలయంలో సామాజిక సమతాసంకల్పం సంతకాల సేకరణ చేశారు. సర్పంచ్ పూడి లక్ష్మణరావు అధ్యక్షతన అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీఓ జి వీరభద్రస్వామి పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భోగి మంట వద్ద మానవహారం



వజ్రపుకొత్తూరు: సాయివినీత్ పాఠశాలలో దూడూ బసవన్నల సందడి



మందస: సూర్యోదయ స్కూల్‌లో భోగిమంటను వెలిగిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు మంగళవారం హత్సాహంగా సాగాయి. పాఠశాలల ఆవరణను సుందరంగా తీర్చిదిద్దారు. పిల్లలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. భోగి మంటలు వేసి పిల్లలు సందడి చేశారు.

సంక్షిప్తంగా...

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

సోంపేట: గ్రామాల అభివృద్ధి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని ఎంపీపీ నిమ్మన దాస్ అన్నారు. సోంపేట మేజర్ పంచాయతీ పరిధి మొగిలి కొత్తూరులో నిర్మించనున్న సిమెంట్ సిమ్మెంటు నిర్మాణానికి మంగళవారం భూమిపూజ చేశారు. సర్పంచ్ నగిరి ప్రభావతి, ఎంపీటీసీ సభ్యుడు బి.ధర్మారావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

సోంపేట: కొర్లాం గ్రామ పంచాయతీకి చెందిన టీడీపీ వార్డు సభ్యుడు రత్నాల చంద్రమోహన్ వైఎస్సార్‌సీపీలో మంగళవారం చేరారు. ఈయనకు ఎంపీపీ నిమ్మన దాస్ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. మండల పార్టీ అధ్యక్షుడు శిలగాన భాస్కరరావు, జేసీఎస్ కన్వీనర్ బుద్దాన శ్రీకృష్ణ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కవిటి: కవిటిలో నిర్మిస్తున్న 132/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి సంబంధించి లైన్ల ఏర్పాటు పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్న కవిటి ఏఈ ఎం.నేతాజీ తెలిపారు. సచివాలయం స్ట్రీట్, అమ్మవారి గుడి వీధి, బస్టాండ్ పరిసరాల్లో సరఫరా ఉండదని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

షాదీఖానా నిర్మాణానికి చర్యలు

కోటబొమ్మాళి: కొత్తపేట గ్రామంలో ముస్లిం కుటుంబాల కోసం తక్షణమే షాదీఖానా (పెళ్లి మండపం) నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్‌కు విజయనగరంలోని ముస్లిం మైనారిటీ బోర్డు మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. కొత్తపేటకు చెందిన మండల కోఆప్షన్ సభ్యుడు రంజాన్‌రాజుబాయ్ మూలపేట పోర్టు శంకుస్థాపనకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డికి షాదీఖానా మంజూరు చేయాలని వినతిపత్రం అందచేశారు. ఈ మేరకు కలెక్టర్ ఆదేశాలతో తహసీల్దార్ జామి ఈశ్వరమ్మ పది సెంట్ల స్థలం మంజూరు చేసినట్లు ఉత్తర్వుల కాపీని ముస్లిం మైనారిటీ బోర్డుకు పంపారు. దీంతో షాదీఖానా నిర్మాణానికి అంచనాలు తయారు చేసి పంపిస్తే ఆమేరకు నిధులు మంజూరు చేస్తామని ముస్లిం మైనారిటీ బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. ఆమేరకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

నేడు ఉద్దానంలో మంత్రి పర్యటన

మందస: రాష్ట్ర మం సీదిరి అప్పలరాజు బుధవారం ఉద్దానంలో పర్యటిస్తారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఉద్దానం క్లస్టర్ ఇన్‌చార్జిలు దున్న హరికృష్ణ, సార్ల ఢిల్లేశ్వరరావు మంగళవారం తెలిపారు. రాంపురం, బహడపల్లి, సరియాపల్లి పంచాయతీల్లో పలు అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభిస్తారన్నారు.

ఏఐవైఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

కాశీబుగ్గ: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐవైఎఫ్) నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం జరిగింది. చైర్మన్ బళ్ల గిరిబాబు, సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోరు వాసుదేవరావు, కొన్ని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జానపద కళా జాతా రథం ప్రారంభం

పలాస/కాశీబుగ్గ:గురుదాసుపురం గ్రామంలో ఈ నెల 11వ తేదీన సంక్రాంతి సందర్భంగా జరుగునున్న సిక్కోలు జానపద కళాజాతా కార్యక్రమానికి సంబంధించిన ప్రచార రథం మంగళవారం మందస మండలం నారాయణపురం మల్లేవానివారిపేట సమీపంలోని బైకాల పోలమ్మ తల్లి ఆలయం వద్ద ప్రారంభమైంది. ప్రచార కార్యదర్శులు కుత్తుం వినోద్, గేదెల తులసయ్య ఆధ్వర్యంలో వేదిక ఉపాధ్యక్షుడు దున్న రామారావు పూజలు చేశారు. కళాభిమానులు పాల్గొన్నారు. కళాజాతాకు పలువురు అతిథులు పాల్గొంటారని ప్రతినిధులు తెలిపారు. కాగా కళాజాతాకు రావాలని కోరుతూ డీఎస్పీ నాగేశ్వరరెడ్డికి ప్రతినిధులు ఆహ్వాన పత్రాన్ని తన కార్యాలయంలో అందజేశారు.